క్లుప్తంగా

వారిజ ఆశ్రమానికి రూ.3 లక్షల విరాళం



చిన జీయర్‌స్వామికి విరాళం అందజేస్తున్న క్షత్రియ సంక్షేమ సమితి నాయకులు

సీతమ్మధార: క్షత్రియ సంక్షేమ సమితి తరపున భీమిలిలో గల వారిజ ఆశ్రమానికి రూ.3లక్షల విరాళం ప్రకటించారు. సీతమ్మధారలోని క్షత్రియ సంక్షేమ సమితి కార్యాలయంలో మంగళవారం చినజీయర్ స్వామి అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామికి విరాళం అందజేశారు. అలాగే సమితి చైర్మన్ ఎం.ఎస్.ఎన్.రాజు రూ.1,01,116, ఎస్.గౌతంరాజు రూ.20,116 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి డైరెక్టర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యక్షుడిగా చంద్రమౌళి



చంద్రమౌళికి అవార్డులు అందిస్తున్న రంగారావు, కమల్ బైద్

మురళీనగర్: వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళిని ఉత్తమ అధ్యక్షుడి అవార్డు వరించింది. ఇటీవల నిర్వహించిన వాకర్స్ జిల్లా-101 పరిధిలో ఏడాది పాటు వివిధ క్లబ్‌లు నిర్వహించిన సేవా కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకున్న నిర్వాహకులు మురళీనగర్ వాకర్స్ క్లబ్‌ను రెండు అవార్డులకు ఎంపిక చేశారు. ఇప్పటికే అనేక అవార్డులు పొందిన ఈ క్లబ్ తాజాగా మరో రెండు అవార్డులు సాధించింది. ఈ మేరకు ఉత్తమ క్లబ్‌తో పాటు ఉత్తమ అధ్యక్షుడి అవార్డులను వాకర్స్ జిల్లా 101 గవర్నర్ టి.రంగారావు, వాకర్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్ బైద్‌ల చేతుల మీదుగా చంద్రమౌళికి అందించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు చంద్రమౌళిని అభినందించారు.

28 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ముగ్గురు వ్యక్తుల నుంచి 28 కిలోల గంజాయిని స్క్వాడ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాల్గవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కి చెందిన నిందితులు ఒడిశా రాష్ట్రం రాయగడలో గంజాయి కొనుగోలు చేసి, కేరళకు తరలించేందుకు విశాఖ వచ్చారు. రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో స్క్వాడ్ పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని నాల్గవ పట్టణ పోలీసులకు అప్పగించారు. సీఐ ఎస్.విజయ కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ లక్ష్మనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నిందితులకు రిమాండ్

సీతమ్మధార: గంజాయి కేసులో అరెస్టు అయిన నిందితులకు రిమాండ్ విధించారు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నైకి చెందిన ఇద్దరు వ్యక్తులు దీపక్ ఈశ్వర్ లక్ష్మణ కుమార్ (21), సంతోష్‌కుమార్ (25) ఒడిశా నుంచి చెన్నైకి వెళుతూ రామాటాకీస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా ద్వారకా పోలీసులు అరెస్టు చేసి, నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని మంగళవారం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. ఈ కేసును ద్వారకా స్టేషన్ సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్ఐ జె.ధర్మేంద్ర దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార: విద్యుత్ హెచ్‌టీ లైన్ల మరమ్మతులు,చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ -1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఆర్.కె. నగర్, ప్రెసిడెన్సియల్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో.. మేరీసిన బంగారం

- రెండు స్వర్ణ పతకాలతో అంతర్జాతీయ కీర్తి
- ఘనత సాధించిన పేదింటి బిడ్డ



బంగారు పతకాలతో మేరీ

మురళీనగర్: నగరానికి చెందిన ఒక పేదింటి బిడ్డ అంతర్జాతీయ స్థాయిలో రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌గా నిలిచి విశాఖ కీర్తి పతాకను ఎగురవేసింది. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెటలర్జికల్ విభాగంలో సాంకేతిక విద్యనభ్యసిస్తున్న ఎస్.మేరీ సౌత్ ఏషియన్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో భారత తరపున పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించి బంగారు బాలికగా సత్తా చాటింది. ఆడపిల్లలు సరదాగా ఆడుకునే రోప్ స్కిప్పింగునే తన క్రీడగా ఎంచుకుని ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. ఆమె తండ్రి రామస్వామి సాధారణ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి రేణుక గృహిణి. మేరీ పెద్దకూతురు కాగా చిన్న కూతురు మెర్సీ. ప్రస్తుతం మెర్సీ కూడా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా సివిల్ సెకండియర్ చదువుతోంది.



మేరీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు, ఇతర అధ్యాపకులు

అసాధారణ ప్రతిభ..

మేరీ సరదాగా నేర్చుకున్న రోప్ స్కిప్పింగ్‌లో వేగాన్ని గమనించిన పాలిటెక్నిక్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ అబ్బాస్‌బేగ్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, మెటలర్జికల్ హెడ్ రత్నకుమార్, ఇతర విభాగాధిపతులు ఆమెను ప్రోత్సహించారు. దీంతో నేపాల్‌లోని ఖాట్మండ్‌లో మే 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన సౌత్ ఏషియన్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో ఆమె పాల్గొంది. 17 ఏళ్ల విభాగంలో మూడు నిమిషాల విభాగంలో 382 స్కోరు చేసి గోల్డ్ మెడల్ సాధించింది. అంతే కాకుండా 30 సెకండ్స్ డబుల్ అండర్ మహిళా విభాగంలో 82 స్కోరు చేసి రెండవ బంగారు పతకాన్ని సాధించి భారతదేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేసింది. దక్షిణాసియా నుంచి ఏడు దేశాలు పాల్గొన్న ఈ పోటీల్లో మేరీ భారత దేశం తరపున ఇందులో పాల్గొన్నారు. మేరీ రెండు విభాగాల్లోనూ ప్రథమ స్థానం సాధించగా బంగ్లాదేశ్‌కు చెందిన మహిళ ద్వితీయ స్థానం, పాకిస్తాన్‌కు చెందిన మహిళ తృతీయ స్థానంలో నిలిచారు. అంతకు ముందు జాతీయ స్థాయిలో జరిగిన రోప్ స్కిప్పింగ్ పోటీలు గత ఏప్రిల్ 13, 14 తేదీల్లో ఢిల్లీలోని తాల్కటోర స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న మేరీ 3 నిమిషాల ఎండ్యూరెన్స్ విభాగంలో 384, 30 సెకండ్స్ డబుల్ అండర్ విభాగంలో 82 స్కోరు సాధించి బంగారు పతకాలు సాధించింది.



జాతీయ చాంపియన్‌గా అవార్డు అందుకుంటున్న మేరీ

ప్రపంచ నంబర్ వన్‌గా నిలవాలి..



సరదాగా నేర్చుకున్న రోప్ స్కిప్పింగ్ నన్ను అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా నిలబెడుతుందని ఎప్పుడూ ఊహించుకోలేదు. ఈ క్రీడలో రాణించడానికి పేదరికం అడ్డు రాలేదు. నా తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు, మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి రత్నకుమార్, పీడీ అబ్బాస్ బేగ్ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఎక్కడ పోటీలు ఉన్నా నాకు అవసరమైన సహాయం అందించారు. దీని వల్లనే నేను అంతర్జాతీయ స్థాయికి ఎదగగలిగాను. రానున్న కాలంలో మరిన్ని పతకాలు సాధించడమే ధ్యేయంగా సాధన చేస్తున్నాను. ఉద్యోగం సాధించి మా కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది.

– ఎస్.మేరీ, స్కిప్పింగ్‌లో బంగారు పతకాల విజేత

ప్రతిసారి విజేతగా నిలిచేది..

మేరీ ఎన్ఏడీలోని కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదివింది. డిప్లొమా కంచరపాలెం మెటలర్జీలో సీటు వచ్చింది. కేంద్రీయ విద్యాలయంలో ఆటల పట్ల ఆసక్తి చూపించేది. అక్కడే స్కిప్పింగ్‌పై ఆసక్తి పెరిగింది. ఆ క్రీడలో టాపర్‌గా నిలిచేది. ప్రతిసారి తను పతకాలు సాధించేది. ఆర్థికంగా డిప్యూటీ మేయరు జియ్యాని శ్రీధర్ సాయం అందించారు. నా స్నేహితులు కూడా సహాయం అందించారు. అంతర్జాతీయ పోటీలకు కాలేజ్ ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది సాయం అందించారు. కోచ్ సాగర్ అన్ని పోటీలకు తీసుకెళ్తున్నారు. ఆయన సాయం మరిచిపోలేం.

– కీరందాసు రామస్వామి, బాలిక తండ్రి

ప్రాణం తీసిన కారు



ప్రమాదంలో మరణించిన వ్యక్తి

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించిన ఉదంతమిది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేట ప్రాంతానికి చెందిన అంబోతుల కనకరాజు (35) ఒక సప్లయర్స్ దుకాణంలో పని చేస్తున్నారు. గురుద్వారా జంక్షన్ వైపు నుంచి మంగళవారం మధ్యాహ్నం సీతంపేట పాత పెట్రోల్‌బంక్ వైపుగా వెళ్లాల్సి ఉంది. ఇంతలో అతను రోడ్డు దాటుతున్న క్రమంలో సత్యం హైవే జంక్షన్ నుంచి గురుద్వారా జంక్షన్ వైపు వస్తున్న ఒక కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కనకరాజు ఎగిరి కింద పడిపోయారు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావంతో ఘటనా స్థలంలోనే మరణించారు. సమాచారం తెలుసుకున్న ద్వారకా ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ఈ కేసుని ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం



సన్యాసమ్మ

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కైలాసపురం మధుసూదన్‌నగర్‌లో కుటుంబంతో కలిసి నివాసమున్న సిరిపురపు సన్యాసమ్మ (73) గత నెల 22 ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లి ఇంత వరకు తిరిగి చేరుకోలేదు. ఈమెకు మతిస్థిమితం లేకపోవడంతో గతంలో కూడా పలుమార్లు ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చేస్తూ ఉండేది. ఈసారి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె కోడలు సిరిపురపు నూకరత్నం సోమవారం రాత్రి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

సక్రమమైన విద్యా విధానంతోనే సమాజ అభ్యున్నతి

చినజీయర్ స్వామి



సీతమ్మధార: సమాజం అభ్యున్నతి సాధించాలంటే సక్రమమైన విద్యా విధానం అమలులో ఉండాలని త్రిదండి చిన జీయర్ స్వామి తెలిపారు. సీతమ్మధారలో జరుగుతున్న గీతా జయంతి వేడుకల్లో నాల్గవ రోజు మంగళవారం ఆరాధన అనంతరం ఆయన అనుగ్రహ భాషణం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోని వస్తువులన్నీ మంచివేనని, వాటి వినియోగం ద్వారా ఆ వస్తువు స్థితి మారుతుందని చెప్పారు. భగవంతుడు మనకి ఇచ్చిన వస్తువులను సక్రమంగా వినియోగించే సాధనమే విద్య అని అన్నారు. సమాజం ఎలా ఉండాలో క్రమం తెలియ చేసే విద్య వేదవిద్య అని చెప్పారు. వేద విద్యలో కనీస అవగాహన కలగడానికి కనీసం 12 సంవత్సరాల సమయం పడుతుందని, తదుపరి సాధన, అధ్యయనం చేయడానికి మరో 8 ఏళ్లు పడుతుందన్నారు. నేర్చుకున్న వేద విద్యను సమాజానికి ఉపయోగించడానికి కృషి చేసేందుకే వేద పాఠశాలలు, ఆధ్యాత్మిక సంస్థలు ఉన్నాయన్నారు. వేద పఠనం ద్వారా ఆ వాక్కులు తరంగాలుగా సమాజంలోని వివిధ ప్రాంతాలకు చేరతాయని తెలిపారు. విద్యా విధానం గాడి తప్పితే ఫలితాలు కూడా వికృతంగానే వస్తాయని చెప్పారు. గతంలో శిశు జననాలు ప్రకృతి ధర్మం ప్రకారం ఉండేవని, అయితే నేడు శస్త్ర చికిత్సలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఇలా ప్రకృతి విరుద్ధంగా జన్మించిన శిశువులకు పూర్తి స్థాయి ధర్మాలు లభించే అవకాశం తక్కువన్నారు.

జీవించే హక్కు హరిస్తున్నారు



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

సీతంపేట: ఆత్మగౌరవంతో స్వేచ్ఛగా జీవించే హక్కు లేకుండా మోడీ ప్రభుత్వం హరిస్తోందని ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, గ్లోబల్‌నెట్‌వర్క్ జిల్లా కార్యదర్శి రాంప్రభు, అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, దళిత హక్కుల పోరాట సమితి నాయకుడు చిన్నారావు తెలిపారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. గాజా నుంచి మణిపూర్ వరకు జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తూ , హక్కులు కాలరాస్తూ, మతోన్మాద రాజకీయానికి మోడీ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. గిరిజన ప్రాంతాలను బలవంతంగా ఖాళీ చేయించి ప్రకృతి సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. దీనిని వ్యతిరేకించిన వారిపై మావోయిస్టుల పేరుతో హత్యలు చేయిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందని, ఏమి తినాలో, ఏ బట్టలు వేసుకోవాలో, ఎవరిని పూజించాలో కూడా వారే శాసిస్తున్నారని చెప్పారు. ప్రధాని మోడీ ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తున్నా, మణిపూర్‌లో మాత్రం పర్యటించడం లేదన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. పాలస్తీనా,ఇజ్రాయిల్. రష్యా , ఉక్రెయిన్ యుద్ధాల వల్ల మహిళలు, చిన్నారులు, వృద్ధులు మృత్యువాత పడుతున్నారని. ఐక్యరాజ్య సమితి చొరవ తీసుకుని యుద్ధ నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

దారికాచి దోపిడీలకు పాల్పడుతున్న యువకులు

పోలీసుల అదుపులో ముగ్గురు

మర్రిపాలెం: రాత్రి సమయంలో దారి కాచి దోపిడీలకు పాల్పడుతూ పాదచారులను,వాహనచోదకులను అడ్డగించి బెదిరింపులకు గురిచేస్తున్న ముగ్గురు యువకులను కంచరపాలెం క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో రెడ్డికంచరపాలెం,ఊర్వశి జంక్షన్ రోడ్డు వద్ద అటుగా వెళ్తున్న వారిని ఆ ముగ్గురు అడ్డగించి డబ్బులు డిమాండ్ చేస్తూ, వారిపై దాడికి చేశారు.ఈ దాడిలో అటుగా నడుచుకుంటూ వెళ్తున్న కారు డ్రైవర్ చేతికి గాయమైంది.విషయం తెలుసుకున్న క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారి వద్ద నుంచి రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణ పూర్తి అయిన తరువాత వివరాలను వెల్లడిస్తామని క్రైం సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

జాబ్‌మేళాలో 35 మందికి ఉద్యోగాలు



డబ్ల్యుఎస్ఎస్ కంపెనీకి ఎంపికైన అభ్యర్థులు

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాలో డబ్ల్యుఎస్ఎస్, అడ్‌హాక్ నెట్‌వర్క్స్, ఐస్మార్ట్ సొల్యూషన్స్ కంపెనీలు పాల్గొని ఉద్యోగాల నియామకానికి సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించాయి. పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి(క్లరికల్) సీహెచ్ సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్యాధికారి టి.చాముండేశ్వరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 178 మంది యువతీ యువకులు హాజరయ్యారు. వీరిలో 35 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా అడ్‌హాక్ నెట్‌వర్క్ కంపెనీ 15 మందిని ఫైనల్ రౌండుకు ఎంపిక చేసింది. ఈ రౌండుకు ఎంపికైన వారిలో అర్హులను రెండు రోజుల్లో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ టి.లక్ష్మి, కె.సంతోష్ కుమార్, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ రమేష్ నాయుడు పాల్గొని అవసరమైన ఏర్పాట్లు చేశారు.

మానవ హక్కులపై వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సెట్విస్ సీఈవో సత్య పద్మ

సీతంపేట: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక బీవీకే కళాశాలలో విద్యార్థులకు సెట్విస్ సంస్థ ఆధ్వర్యంలో మానవ హక్కులు అనే అంశంపై మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు సెట్విస్ సీఈవో ఎం.సత్యపద్మ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎ.బాబు, ప్రిన్సిపాల్ రత్నకుమార్,భాస్కర్, మూర్తి, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వాచ్‌మన్ మృతి



వాచ్‌మన్ మృతదేహం

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక వాచ్‌మన్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేటలోని రెల్లివీధిలో గల ఒక గ్రూప్‌హౌస్‌లో పి.సూరినాయుడు (35) వాచ్‌మన్‌గా పనిచేస్తూ, కుటుంబసభ్యులతో నివాసం ఉంటున్నాడు. ఇతనికి రోజూ రాత్రిపూట భవనంపైన ఉన్న లిఫ్ట పైభాగంలో నిద్రించే అలవాటు ఉంది. ఈ నేపథ్యంలో సూరినాయుడు సోమవారం రాత్రి కూడా యథావిధిగా నిద్రించాడు. కాగా, భవనంలో ఉంటున్న స్వామి అనే వ్యక్తి మంగళవారం మేడపైకి వెళ్లి చూడగా సూరినాయుడు రక్తపుమడుగులో కనిపించాడు. దీంతో ఆయన ద్వారకా పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కి తరలించారు. అనుమానాస్పద మృతికేసుగా నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మనసు దోచిన మధుర గీతాలు



జ్యోతి ప్రజ్వలనతో సినీ సంగీత విభావరిని ప్రారంభిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: కేవీఆర్ స్వర్ సంగీత్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. వీరేంద్ర యాదవ్, స్వర్ణ పాడిన ఇదేదో గోలగా ఉంది, కోటేశ్వరరావు, శైలజా పాడిన ఏం వానో తరుముతున్నది, మహ్మద్ ఖాన్, రంజిత పాడిన రబ్బరు గాజులు, చెన్నా తిరుమలరావు, స్వర్ణ పాడిన ఆకులు పోకలు ఇవ్వొద్దు, పావనితో పాడిన ఏమిటో ఇది ఏమిటో, శ్రీనివాస్, రాధ పాడిన భలేగా ఉందిరో, బాలకృష్ణ రాధ పాడిన అందాలలో అహో వంటి గీతాలు, ప్రభాకర్, ఆశాలత, వాసు, ఎమ్మెస్ మాధవ్, మెలోడీ సత్యనారాయణ, ఎస్ఎస్ఎన్ రాజు, చిరంజీవి, చంద్రకళ, ఆంజనేయరెడ్డి ప్రజాదరణ పొందిన గీతాలతో సంగీత రస హృదయాల్ని కట్టి పడేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు వీరేంద్ర యాదవ్‌ను కళా సంస్థల అధ్యక్షుడు కొణతాల రాజు, జి. త్యాగరాజు, వివిధ కళా సంస్థల అధినేతలు ఘనంగా సత్కరించారు. సినీ సంగీతంపై ఉన్న మక్కువతో కేవీఆర్ స్వర సంగీత్ సంస్థ ఏర్పాటు చేశానని, ఔత్సాహిక గాయనీ గాయకులకు అవకాశం కల్పిస్తున్నామని వీరేంద్ర యాదవ్ తెలిపారు.

స్పీడ్‌బ్రేకర్లు లేక ఇక్కట్లు



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో స్పీడ్‌బ్రేకర్లు లేని జంక్షన్

సీతమ్మధార: సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని పలు ప్రాంతాల్లో నాలుగురోడ్ల కూడళ్లు ఉన్నాయి. ఈ మార్గంలో పలు బ్యాంకులు, షాపింగ్‌కాంప్లెక్సులు ఉన్నాయి. దీంతో రాకపోకలు సాగించే పాదచారుల, వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఇది కొండవాలు ప్రాంతం కావడంతో పై భాగం నుంచి వచ్చే వాహనాల వేగం అదుపు చేయడం కష్టతరంగా ఉంటోంది. సీతమ్మధార సాయిబాబా ఆలయం రోడ్డు నుంచి పోర్టు స్టేడియం గేటు వరకు వెళ్లే ఈ మార్గంలోని జంక్షన్లలో స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయి. దీంతో పాదచారులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, ఇప్పటికైనా జీవీఎంసీ జోన్-3 పబ్లిక్‌వర్క్స్ ఇంజినీర్లు, ద్వారకా పోలీసులు స్పందించి జంక్షన్లలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



విశేష పూజలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలు 9వ రోజు మంగళవారం అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు జరిపారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం , 6 నుంచి రాత్రి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ జరిపారు. అష్టదళ పద్మారాధనలో, త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే ఆసక్తి గల భక్తులు మార్గశిర గురువారాల్లో రూ.7,500, గురువారం మినహా మిగిలిన రోజుల్లో రూ.2,500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఈవో శోభారాణి తెలిపారు.

మండపంలో వైదిక కార్యక్రమాలు..

ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీచక్రనవావర్లార్చన, లక్ష్మీహోమం, మార్గశిర మాస విశేష కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చనలు, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహా విద్యాపారాయణ భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చనలు చేశారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వేదపారాయణ, మహా విద్యాపారాయణ జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఇతరుల హక్కులను గౌరవించాలి



ర్యాలీలో పాల్గొన్న ముఖ్య అతిథులు

అల్లిపురం: సమాజంలో ప్రతి ఒక్కరు ఇతరుల హక్కులను గౌరవించాలని లీగల్ సర్వీసెస్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంపీ శేషమ్మ అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మహిళా సంక్షేమం, శిశు సంక్షేమ శాఖ, యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ అప్‌హోల్డ్ ఆర్గనైజేషన్, ప్రభుత్వ మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ హక్కుల గురించి తెలుసుకుని స్వేచ్ఛగా జీవించాలన్నారు. ముందుగా విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ జయలక్ష్మి, ఏడీసీపీ ఎం.మోహనరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జి. డేవిడ్ రాజు, మర్రి సత్యనారాయణ, శరణ్య, శారద పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో..

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి మాణిక్య కుమారి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మానవ హక్కులపై ప్లకార్డులు పట్టుకుని మానవహారంగా ఏర్పాడ్డారు. డాక్టర్ ప్రవీణ, వెంకట్ పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్ధరాత్రి తనిఖీల్లో రోగి సహాయకుడితో మాట్లాడుతున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: రాత్రి వేళల్లో రోగుల సేవలకు ఇబ్బందులు కలగడం, వైద్యులు సకాలంలో రాకపోవడం, నర్సులు అందుబాటులో లేకపోవడంవంటి ఆరోపణలు కేజీహెచ్‌లో వెల్లువెత్తుతున్న నేపథ్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ రంగంలోకి దిగారు. సోమవారం అర్ధరాత్రి తనిఖీల్లో అనేక లోపాలు గుర్తించడంతో వాటిని చక్కదిద్దే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. క్యాజువాలిటీ, అత్యవసర విభాగం, యాంటీ మెడికల్ కేర్ యూనిట్ (ఏఎంసీ), గైనిక్ వార్డుల్లో తనిఖీలు నిర్వహించి లోపాలు గుర్తించారు. సమగ్ర పర్యవేక్షణకు సూపరింటెండెంట్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు, డిప్యూటీ చీఫ్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు రోజువారీ రాత్రి విధులను పర్యవేక్షించాలని నిర్ణయించారు. నర్సింగ్ సేవలు, భద్రత, రోగి సంరక్షణ విషయాలను పరిగణనలోకి తీసుకుంటారు.